క్లుప్తంగా

క్యాలెండర్ల ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పలు సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కేసీ.వెంకటేశ్వర్లు, పరమేశ్వర్, వీరేందర్‌జీ, గన్నోజు శ్రీనివాస్, వెంట్రాములు, రాజసింహుడు, పి.రాజు, బాలశివుడు, చెన్నయ్య, ఆంజనేయులు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సబ్‌కా మాలిక్ ఏక్‌హై ఫౌండేషన్ క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మీర్ సికందర్, అబ్దుల్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల సీఐగా ఆదిరెడ్డి

జడ్చర్ల: నూతన సీఐగా ఆదిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న రమేశ్‌బాబు రిలీవ్ అయ్యారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ



నవాబుపేట: మండలకేంద్రంలో వార్డు సభ్యుడు కోట్ల రాజేష్ పంచాయతీ సిబ్బందికి, కార్మికులందరికీ దుస్తులు అందజేసి తన పదవీకాలంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని సన్మానించారు. కారోబార్ లక్ష్మయ్య, రమేష్, నర్సింహ, కృష్ణయ్య, మల్లేష్, వెంకటయ్య, నర్సింహులు, శివ, మల్లేష్, రాంమోహన్‌శర్మ, అమర్‌నాథ్‌రెడ్డి, నాగరాజ్, శివ తదితరులు ఉన్నారు.

యన్మన్‌గండ్ల వాసికి డాక్టరేట్ ప్రదానం



నవాబుపేట: మండల పరిధిలోని యన్మన్‌గండ్ల వాసి ఖాజాముజ్బాహుద్దీన్ కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసి జేఎన్‌టీయూ నుంచి బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను మండల ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంతో పాటు పేరూర్, అప్పంపల్లి, ముచ్చింతల జిల్లా ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్ కల్చరర్ హెరిటేజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తెలంగాణలో పురాతన కట్టడాలు, జిల్లాలో ఉన్న పురాతన కట్టడాల గురించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతి పాఠశాల నుంచి ఆరుగురు పాల్గొన్నారు. ప్రతిభచాటిన వారికి నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారు. ఇంటాక్ ప్రతినిధులు వెంకట్రాంరెడ్డి, సత్యం, ప్రధానోపాధ్యాయులు సుమన్, రవిశంకర్, గోపాల్, శ్యామ్‌ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో బీఆర్‌ఎస్ కార్యకర్త చెన్నయ్య మాతృమూర్తి నాగలక్ష్మి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. నాగలక్ష్మికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి రూ.10వేల సాయం చేశారు.

కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనం

బాలానగర్: మండల పరిధిలోని 37 గ్రామాల కార్యదర్శులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విధుల్లో చేరి 4 సంవత్సరాలు పూర్తయి... రెగ్యులర్ అయిన 29 మందికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎంతో కృషిచేశారని అన్నారు. కాగా పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లతో పాటు, కార్యదర్శులను సన్మానించారు. ఎంపీఓ విజయకుమారి, ఏపీఓ రాజశేఖర్, ఏఓ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ హలీం తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన విద్య అందిస్తాం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యావ్యవస్థలో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని మాడల్‌బేసిక్ పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సదుపాయాలు లేని కారణంగా ఏ విద్యార్థి కూడా చదువులో వెనుకపడిపోకూడదని, అందరినీ చదువులో ముందు వరుసలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. ప్రస్తుతం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థులు రానున్న 40 రోజులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని.. మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలను సందర్శించి, అక్కడి పరిస్థితులను తెలుసుకుంటానన్నారు. ప్రభుత్వం, ఎన్‌జీఓల సహకారంతో వసతులను కల్పిస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు తనవంతుగా రూ.1 లక్షను ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పకుండా న్యూస్ పేపర్, పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మాడల్‌బేసిక్ పాఠశాలలో కిచెన్‌షెడ్డును ఏర్పాటు చేస్తామని వివరించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను, ఇంజనీరింగ్ వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని.. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ జయశ్రీ, హెచ్‌ఎం బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్రంలో గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం హనుమాన్‌గడ్డ తండాలో పంచాయితీ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ భరత్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాయకులు విద్యాసాగర్‌గౌడ్, రవీందర్, రాజునాయక్, రామునాయక్, రామస్వామి, శేఖర్, థావ్ర్యానాయక్, మహేందర్‌నాయక్ పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడి మార్పుతో బీసీల విజయం

● బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: బీజేపీ ఇటీవల ప్రకటించిన జిల్లాల అధ్యక్షుల మార్పు విషయంలో.. నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా మళ్లీ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించడం తమ విజయంగా భావిస్తున్నట్లు సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలోని రెండు జిల్లాల అధ్యక్షులుగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను తొలగించి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి ఇచ్చిన రోజు నుంచి అన్ని నియోజకవర్గాల్లో కుల సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలతో కలిసి పోరాటం చేసినట్లు వివరించారు. ఫలితంగానే నారాయణపేట జిల్లాకు అధ్యక్షునిగా బీసీని నియమించారని అన్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో కూడా తిరిగి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలని బీజేపీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట సీఎం అభ్యర్థిగా బీసీనే ఉంటాడని గత ఎన్నికల సందర్భంగా బీజేపీ కేంద్ర అధిష్టానం నిర్ణయించిన నేపథ్యంలోనే... 65శాతం వరకు ఉన్న బీసీలు ఉన్న పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా సైతం వెంటనే బీసీని నియమించాలన్నారు. బీసీలకు అధికారం ఇవ్వకుండా చూడాలని ప్రయత్నిస్తున్న అగ్రవర్ణాలకు చెందిన నాయకుల విషయంలో పార్టీ అధిష్టానం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అప్పుడే ఆ పార్టీకి మరింత మనుగడ ఉంటుందని తెలిపారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సముచిత స్థానం కల్పిస్తే బీసీ సమాజ్ వెన్నంటే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సమాజ్ కోకన్వీనర్ సవారి సత్యం, ముదిరాజ్ సంఘం నాయకులు ఆశన్న, రజక సంఘం నాయకులు ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేద్దాం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు పిలుపునిచ్చారు. బుధవారం మల్లెబోయిన్‌పల్లిలో సంఘం ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ ప్రభుత్వం రైతులను, వ్యవసాయ కూలీలను, కార్మికులను అనేక రకాలుగా ఇబ్బందులు పడేలా చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, కార్యదర్శి మోహన్, నాయకులు శివలీల, ఆండాలు, హనుమంతు, పాండు, ఈర్లపల్లి యాదయ్య, వెంకటేశ్, భగవంతులు పాల్గొన్నారు.

మహాత్ముడి సేవలు మరువలేం



విగ్రహావిష్కరణ చేస్తున్న సర్పంచ్ తదితరులు

బాలానగర్: గాంధీజీ సేవలు వెలకట్టలేనివని సర్పంచ్ మాలతి అన్నారు. మోతీఘణాపూర్ పంచాయతీ ఆవరణలో పాలకమండలి ఆధ్వర్యంలో మహాత్ముడి విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన సర్పంచ్ మాలతి, గ్రామ పెద్దలు ప్రతాప్ రెడ్డి మాట్లాడారు. యాదిరెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, పరుషరాములు, నర్సిములు, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ సుశీల తదితరులు

రాజాపూర్: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల సేవలు ఎనలేనివని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాజాపూర్‌లో 24 సర్పంచ్‌లను వారి పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా సన్మానించారు. ఎంపీపీ సుశీల అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. కాగా గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లులు ఇప్పటికీ రాకపోవడంపై ఆవేదనవ్యక్తం చేశారు. బిల్లులు వచ్చేవిధంగా కృషి చేయాలని ఎంపీడీఓ లక్ష్మీదేవిని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు గంగాధర్‌గౌడ్, సుధారాణి, లక్ష్మీదేవి, గోవింద్‌నాయక్, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు జాగ్రత్తగా నడపాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: స్కూల్ బస్సులను డ్రైవర్‌లు తగు జాగ్రత్తలతో నడపాలని ఆర్టీఓ నరేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మౌంట్‌బాసిల్ పాఠశాలలో వివిధ పాఠశాలల బస్సుల డ్రైవర్‌లతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. డ్రైవింగ్ చేసే క్రమంలో మద్యం సేవించరాదని, అప్రమత్తంగా ఉండడం అవసరం అన్నారు. డ్రైవర్‌లు ఆరోగ్య నియమాలు పాటిస్తూ ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాహనం ప్రమాదానికి గురైనప్పుడు పూర్తి ప్రావీణ్యంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడవద్దని తెలిపారు.

రాగిజావ పంపిణీ

హన్వాడ: మండలంలోని వివిధ పాఠశాలలకు బెల్లం, రాగిజావను ఎంఈఓ రాజునాయక్ బుధవారం పంపిణీ చేశారు. ఒక్కో పాఠశాలకు 25 కిలోల బెల్లం, రాగిజావ బస్తాలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శివాజీ విగ్రహానికి విరాళం



దేవరకద్ర: మండలంలోని గోపన్‌పల్లిలో ప్రతిష్ఠించనున్న శివాజీ విగ్రహం కోసం కాంగ్రెస్ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి బుధవారం రూ. 10 వేలు విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన శివాజీ ఉత్సవ కమిటీ సభ్యులు ఈ మేరకు నగదు అందుకున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మహమ్మదాబాద్: ఉపాధ్యాయుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని మండల యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ తెలిపారు. బుధవారం సీపీఎస్ నెంబర్2 మహమ్మదాబాద్ పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలు మార్చాలని అన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు పనివేళలు ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఇదివరకే తీసుకువెళ్లామని పరిశీలించి పరిష్కరించాలని కోరారు. మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శిగా సాయన్న, ఉపాధ్యక్షులుగా గౌరమ్మ, కోశాధికారిగా వెంకటేశ్‌లు ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా కార్యదర్శులు సలీం, సత్యానారాయణ, గండేడ్ మండల అధ్యక్షుడు గంటా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని టీపీసీసీ ఎస్టీసెల్ వైస్ చైర్మన్ రామావత్ శేఖర్, జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ లింగంనాయక్ అన్నారు. పట్టణ ఆదివాసీ గిరిజన చైర్మన్ పాత్లవత్ రవినాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆదివాసీ గిరిజన విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం పట్టణ ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్లుగా రఘువీర్‌సింగ్, హరినాయక్, కన్వీనర్‌గా పి.తిరుపతినాయక్, కోకన్వీనర్‌గా రవినాయక్, కోఆర్డినేటర్‌గా శ్యాంసుందర్, ఈసీ సభ్యులుగా అరుణ్‌నాయక్, రాంచందర్‌లను నియమించారు. సమావేశంలో ఈసీ సభ్యులు మోహన్‌లాల్, రూరల్ మండల అధ్యక్షుడు తులసిరాం నాయక్, గిరిజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి యాదగిరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జ్యోతిబాపూలే విగ్రహాన్ని తెలంగాణ శాసనసభ ఆవరణలో ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్వీ నాయకులు పల్లయ్య పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కల్వకుంట్ల కవిత చేపట్టిన ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. భరత్, హరి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవ నియంత్రణ పద్ధతులతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ

జడ్చర్ల: వరిలో చీడపీడల నివారణకు జీవ నియంత్రణ విధానాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని రాష్ట చీడపీడలు, జీవ నియంత్రణ సమన్వయ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ రైతులకు వివరించారు. బుధవారం నసరుల్లాబాద్ శివారులో వరి పంటలో చీడపీడలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. వరిలో చీడ పీడల నివారణకు పురుగు మందులు వాడకుండా జీవ నియంత్రణ పద్ధతుల ద్వార సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగులను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గోపీనాథ్, ఏఈఓ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందజేస్తున్న సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఫిబ్రవరి 16న తాము ఆందోళనలో పాల్గొంటున్నామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా నాయకులు ఎర్ర నర్సిములు, కిల్లె గోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్ కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విశ్వనాథం, బాలరాజు, చిన్న కృష్ణ, యాదమ్మ, శివరాజ్, యాదయ్య, నరేష్, లక్ష్మమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని చదవాలి



మాట్లాడుతున్న డీఐఈఓ శ్రీధర్‌సుమన్

మిడ్జిల్: విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని చదవాలని.. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్‌సుమన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు సమయం వృథా చేయరాదన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ గౌస్, ప్రిన్సిపాల్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం



మల్లెబోయిన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జడ్చర్ల మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మల్లెబోయిన్‌పల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో మన ఊరు–మన బడి కింద నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులు, ఆలూరులో పంచాయతీ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన అన్ని హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీ హామీలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, ఎంఈఓ మంజులాదేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటయ్య, సర్పంచ్‌లు సుకన్య, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బుధవారం ఊరంచుతండాలో నూతన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ సాలీబాయితో కలిసి ఆయన ప్రారంభించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు ప్రదర్శించడం తగదు



మాట్లాడుతున్న అధికారులు

అడ్డాకుల: ప్రజలందరూ సమానమేనని, అసమానతలను ప్రదర్శించడం తగదని డిప్యూటీ తహసీల్దార్ స్వప్న అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అంటరానితనాన్ని ప్రదర్శిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమానత్వంపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ మంజుల, గిర్దావర్ రాజేశ్వరి, కార్యదర్శి సరస్వతి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కేవీపీఎస్ నాయకుడు బాలరాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



భూత్పూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు బోధించారు. జిల్లా కలెక్టర్‌గా సుమయ, డీఈఓగా శివరాములు, ఎంఈఓగా అయేషా, హెచ్‌ఎంగా దీనాతో పాటు 34 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం ఆనందమ్మ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఏకలవ్య కాలనీలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని నాయకులు కోరారు. జిల్లా ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో కనీస సౌకర్యాలైన తాగునీరు, కరెంట్ స్తంభాలు, వీధిలైట్లు, డ్రెయినేజీలు వంటివి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సంఘం అధ్యక్షుడు రాగిరి నర్సిములు, ప్రధాన కార్యదర్శి సుక్కన్న తెలిపారు.

ఆదర్శప్రాయుడు గద్దర్



గండేడ్: నిత్యం ప్రజలకోసం ఆలోచించి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న వ్యక్తి ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఆదర్శ ప్రాయుడని జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య తెలిపారు. బుధవారం గద్దర్ జయంతిని పురస్కరించుకుని గండేడ్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ తాలుకా ఇన్‌చార్జ్ చెన్నయ్య, వివేకానంద, వెంకటయ్య, అంజిలయ్య, నర్సింలు, కేశవులు, అడివయ్య హనుమంతు తదితరులు పాల్గొన్నారు.